క్లుప్తంగా

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని ఎస్‌కె ఎస్‌ఎస్ ఫాక్స్ కాన్ (ఆపిల్ సంస్థ) సౌజన్యంతో స్థానిక ప్రేమలా గార్డెన్‌లో మంగళవారం నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు కోవ సాయినాథ్ ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 10 గంటలకు మేళా ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన మహిళలు దీనికి అర్హులని పేర్కొన్నారు. నిరుద్యోగ మహిళలు తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

సేవాలాల్ దీక్ష స్వీకరించాలి


మాట్లాడుతున్న రూప్‌లాల్ నాయక్

కెరమెరి: జిల్లాలోని లంబాడాలు ఈ ఏడాది సేవాలాల్ దీక్ష స్వీకరించాలని సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26న మహాశివరాత్రి పురస్కరించుకొని నార్నూర్ మండలం కొత్తపల్లిలో 41 రోజుల సేవాలాల్ దీక్ష స్వీకరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని లంబాడాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు రాథోడ్ రమేశ్, రాథోడ్ దేవేందర్ ఉన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశపరీక్ష

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల, బాలుర గురుకుల పాఠశాలలు, కళాశాల, కళాశాలల్లో ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గురుకులాల్లో 5 నుంచి 9వ తరగతిలో ప్రవేశాలకు జిల్లాలో మొత్తం 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు గురుకులాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో 3,828 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 65 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

పరామర్శ

బెజ్జూర్: మండలంలోని పోతేపెల్లి గ్రామానికి చెందిన కారోబార్ రౌతు శంకర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కాగజ్‌నగర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్ ఆదివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

శివాజీ మహరాజ్ ఆదర్శప్రాయుడు

ఆసిఫాబాద్‌అర్బన్: శివాజీ మహరాజ్ ఆదర్శప్రాయుడని బీజేపీ జిల్లా నాయకుడు బోనగిరి సతీశ్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని బెలూన్ థియేటర్‌లో శివాజీ మహరాజ్ గొప్పతనం ప్రతి ఒక్కరికీ తెలిసేలా చేయడంలో భాగంగా ఆదివారం సినిమా ప్రదర్శన చేయించారు. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా సినిమా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శివాజీ మహరాజ్‌తో పాటు ఆయన కుమారుడు శంభాజి మహరాజ్ ఎంతో గొప్పవీరుడని కొనియాడారు. వారి చరిత్ర నేటి, భావి తరాలకు అందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. చరిత్రను తెలియజేయాలనే ఉద్దేశంతో సినిమా ప్రదర్శన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖులు తాటిపల్లి అశోక్, వివేక్, దిలీప్, కోటేశ్వర్ రావ్, న్యాయవాదులు చరణ్‌తేజ, తదితరులు పాల్గొన్నారు.

వీఐపీ పాసులు రద్దు


కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న జాతరలో వీఐపీ పాసులను రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా తెలిపారు. ఈ నెల 27న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనుండటంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహాశివరాత్రి జాతరలో వీఐపీ పాసులు రద్దు చేస్తున్నామని ప్రకటించారు.

నిరుపేదలకు బాసటగా ఉండాలి

బేల: ముస్లిం సోదరులు నిరుపేదలకు బాసటగా ఉండాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త గయాజ్ అహ్మద్ పేర్కొన్నారు. మండలంలోని దహెగాం గ్రామంలోని దారుల్ ఉలూమ్ అజీజియా మదర్సా 13వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మదర్సాలో దివ్య ఖురాన్‌ను కంఠస్థం సంపూర్తి చేసిన 8 మంది విద్యార్థులను సన్మానించారు. మదర్సా నిర్వాహకులు అక్బరుద్దీన్ ఇస్సామి, ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం 'సిద్ధి హనుమాన్'


మహాశివరాత్రి జాతరకు ముస్తాబైన తాటిపల్లిలోని హనుమాన్ ఆలయం


ఆలయంలోని హనుమాన్ విగ్రహం

- శివరాత్రి పురస్కరించుకుని ఆలయంలో 41వ మహాజాతర
- నేటి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలోని వార్ధా నది ఒడ్డున వెలసిన శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయం భక్తుల కొంగుబంగారంలా నిలుస్తోంది. ఏటా మహాశివరాత్రి పురస్కరించుకుని నిర్వహించే జాతరకు వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. సోమవారం నుంచి ఆలయంలో ఉత్సవాల నిర్వహణకు ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఏటా మహాశివరాత్రి సందర్భంగా మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి వార్ధా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకుంటారు.

తెలుగు–మరాఠీ సంప్రదాయాలకు నిలయం

ఈ ఆలయం ఇటు తెలుగు, అటు మరాఠా ప్రజల సంప్రదాయాలకు నిలయంగా ఉంది. ఏటా మహాశివరాత్రికి ఇక్కడ జరిగే జాతరకు వార్ధా నదికి అవతలి ఒడ్డున ఉన్న మహారాష్ట్ర భక్తులు ఇటు తెలంగాణలోని భక్తులు తమ సంప్రదాయాల ప్రకారం మొక్కులు చెల్లించుకుంటారు. ఇక్కడే ఇరురాష్ట్రాల ప్రజల సమ్మేళనం జరుగుతోంది. జాతర సందర్భంగా మహారాష్ట్రలోని బంధువులను ఇక్కడే కలుసుకుని సామూహిక భోజనాలు చేస్తుంటారు. జాతర నిర్వహించే వారం రోజులు మరాఠీ, తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు నిర్వహిస్తుంటారు.

నేటినుంచి ఉత్సవాలు

హనుమాన్ ఆలయంలో సోమవారం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయం వద్ద మహా జాతర, ఇతర కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు ఆలయంలో ప్రతీరోజు ఉదయం 6 గంటలకు మహాహారతి, మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులకు అన్నదానం, 26న ఆలయంలో మహా జాతర నిర్వహించనున్నారు. 27న ఆలయం వద్ద 'సావ్‌ధాన్‌సాసుబాయి' మరాఠీ నాటక ప్రదర్శన నిర్వహించనున్నారు. తాటిపల్లి వరకు తారు రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. జాతర సందర్భంగా ఆలయం వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆర్టీసీ బస్సు సేవలను కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

41 ఏళ్లుగా జాతర..

19వ శతాబ్దంలో తాటిపల్లి శివారులోని వార్ధానది మధ్యలోని ఎత్తైన ప్రదేశంలో హనుమాన్ ఆలయం వెలిసింది. ఆలయానికి దాదాపుగా 66 ఏళ్ల చరిత్ర ఉంది. వార్ధా నది నీరు ఉధృతంగా ప్రవహించినప్పుడు నదిలో హనుమాన్ విగ్రహం వెలిసిందని భక్తుల నమ్మకం. నాటి నుంచి ఏటా భక్తులు పూజ లు చేస్తున్నారు. 41 ఏళ్లుగా మహాశివరాత్రి రోజున జాతర నిర్వహిస్తున్నారు. భక్తులు ఇచ్చే కానుకలతోనే ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. జాతర రోజు మహారాష్ట్ర నుంచి వచ్చిన ప్రత్యేక నాటిక బృందాలతో ప్రదర్శనలు నిర్వహిస్తుంటారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి



ఏటా హనుమాన్ ఆలయంలో మహాశివరాత్రి జాతర ఘనంగా నిర్వహిస్తున్నాం. నేటి నుంచి ఐదురోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తాం. 26న ఆలయంలో మహా జాతర నిర్వహిస్తాం. జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేయాలి.

– ఎల్ముల్లే దత్తు, ఆలయ కమిటీ చైర్మన్, తాటిపల్లి

బస్సు సౌకర్యం కల్పించాలి



తాటిపల్లి కుర్దా శ్రీ హనుమాన్ ఆలయానికి వెళ్లడానికి బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. జాతరకు భక్తులు వేల సంఖ్యలో వస్తుంటారు. బస్సు సౌకర్యం కల్పించాలి. వార్ధా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలో పూజలు చేస్తారు. వార్ధా నది వద్ద ప్రభుత్వం స్టీమర్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలి.

– బొమ్మకంటి మహేశ్, మొగడ్‌దగడ్

వృథాగా భగీరథ నీరు


రోడ్డుపై పారుతున్న నీరు

- పలుచోట్ల పైపులైన్లకి లీకేజీ
- రోడ్డుపై చేరుతున్న నీరు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని బాపునగర్‌కాలనీలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా చోట్ల భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేసి నల్లాలు ఏర్పాటు చేశారు. కాని వాటికి ట్యాప్‌లు ఏర్పాటు చేయలేదు. దీంతో నీరు రోడ్డుపై చేరి బురదగా మారుతోంది. రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని బాపునగర్, కసబ్‌వాడీ, బ్రహ్మన్‌వాడ, సందీప్‌నగర్ పాత కూరగాయల మార్కెట్‌లో నీరు వృథాగా పోతోంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

మరమ్మతు చేపట్టాలి



భగీరథ పైపులు లీకేజీతో నీరు రోడ్డుపై చేరుతుంది. వాహనాలు వెళ్తుండగా నీరు షాపుపై పడుతున్నాయి. అధికారులు పట్టించుకుని పైపులకు మరమ్మతు చేపట్టాలి.

– సోను, ఆసిఫాబాద్

ట్యాప్ బిగించాలి



నల్లాలు ఏర్పాటు చేశారు వాటికి ఆన్‌ఆఫ్ చేసే ట్యాప్‌లు బిగించలేదు. నీరు వృథాగా రోడ్డుపై పోతుంది. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు పట్టించుకోవాలి.

– అజయ్, బాపునగర్ కాలనీ

వంతెన పనులు త్వరగా పూర్తిచేయాలి


వంతెన పనులు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

పెంచికల్‌పేట్: మండలంలోని గొల్లవాడకు వెళ్లే రహదారిపై వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఆదివారం గ్రామస్తులతో కలిసి ఆయన వంతెన పనులను పరిశీలించారు. గత ప్రభుత్వం హయాంలో వంతెన నిర్మాణానికి రూ.2.64కోట్ల నిధులు మంజూరు చేయగా ఎన్నికల కోడ్‌తో పనులు ప్రారంభం కాలేదన్నారు. వంతెన పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ సంజీవ్ మాజీ ఎంపీటీసీ రాకేశ్, నాయకులు ఎస్‌కే బాబు, చలం, సిద్దు, పల్లెం వెంకటి, గ్రామస్తులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి


కౌటాల: ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

కౌటాల: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. కౌటాలలో ఆదివారం ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నిరుద్యోగులకు కాంగ్రెస్ అనేక ఉద్యోగాలు ఇస్తుందన్నారు. అన్నివర్గాల వారికి మేలు జరగాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటాలని, కార్యకర్తలు ఓటర్లకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. సోమవారం మంచిర్యాలలో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభను కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, నాయకులు తిరుపతి, రవీందర్‌గౌడ్, గట్టయ్య, కిశోర్, వసంత్ తదితరులు పాల్గొన్నా రు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో మార్నింగ్ వాక్‌లో భాగంగా ఎమ్మెల్సీ దండె విఠల్ ఆదివారం విద్యావంతులతో నడుస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కొనసాగించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మంచిర్యాలకు సీఎం రాక

బెజ్జూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మంచిర్యాలకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు తెలిపారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలో ఆదివారం పలువురు పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా పట్టభద్రులు మంచిర్యాలకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ ప్రచారం

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నూర్‌నగర్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు జమీర్, ప్రదీప్, సామిత్ పటేల్, ఆకాశ్, సమీర్, అర్బాజ్, సమీర్, షహబాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో వాహనం జాగ్రత్త!

- పొంచి ఉన్న ప్రమాదం
- బైక్, కార్ల నిర్వహణ కీలకం


జిల్లా కేంద్రంలో ఎండలో పార్కింగ్ చేసిన బైక్‌లు

ఆసిఫాబాద్‌అర్బన్: భానుడి ప్రతాపం రోజురోజుకు పెరుగుతుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. వేసవి వచ్చిందంటే చాలు భానుడి భగభగలతో జనం అల్లాడుతుంటారు. ఉదయం 10 గంటలు దాటితే ఇంట్లో నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వస్తే శీతలపానీయాలు, పండ్ల రసాలు తీసుకుంటున్నారు. వేసవి తాపానికి గురికాకుండా మనం ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటామో వాహనదారులు తమ వాహనాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు మెకానిక్‌లు. వాహనాల విషయంలో వేసవి జాగ్రత్తలు, సాంకేతిక సమస్యలు అధిగమించేందుకు నిపుణుల సలహాలు అవసరమని పలువురు చెబుతున్నారు.

దూరప్రయాణాలు వద్దు

కొందరు బైక్‌లపై దూర ప్రయాణాలు ఇష్టపడతారు. వేసవిలో దూరప్రయాణాలు చేయకపోవడమే మంచిది. ఎండల్లో ఎక్కువ ప్రయాణించడం వల్ల ఇంజిన్, టైర్లు వేడెక్కుతాయి. టైర్లు పేలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. బైక్‌లపై తప్పనిసరి పరిస్థితుల్లో దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే మార్గమధ్యలో చల్లటి ప్రదేశాల్లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడం మేలు.

ఎండలో పార్కింగ్ చేస్తే అంతే..

వాహనాలను ఎండలో పార్కింగ్ చేస్తే జేబుకు చిల్లులు పడడం ఖాయమంటున్నారు నిపుణులు. వేసవిలో వడదెబ్బ తగలకుండా మనం ఎన్నో జాగ్రత్తలు పాటిస్తాం. కానీ, మనుషులకే కాదు వాహనాలకు ఎండ తాకిడి ఉంటోంది. రంగు వెలసిపోవడం, పెట్రోలు ఆవిరైపోతుంటాయి.

జాగ్రత్తలు ఇవి..

ఎండలో ఇంజిన్ ఆయిల్ త్వరగా వేడెక్కి పలుచన వుతుంది. ఎండాకాలం మొదలవగానే మార్చుకోవడం శ్రేయస్కారం. పెట్రోలు ట్యాంకుపై మందపాటి కవర్ ఉండేలా చూసుకోవడంతో కొంతమేర పెట్రోలు ఆవిరి కాకుండా తగ్గించుకోవచ్చు. టైర్లు అరిగి ఉంటే మార్చుకోవాలి. ట్యూబ్‌లకు పంక్చర్లు వేసవిలో మార్చాలి. మధ్యాహ్నం ఎండలో వాహనాలు పార్కింగ్ చేసి పెడితే వాటి జీవితకాలం తగ్గుతుంది. వేసవిలో ఇంజిన్ గార్డు తొలగించడం మంచిది. దూరప్రయాణమైతే బస్సులోనే వెళ్లడం ఉత్తమం. తప్పనిసరి పరిస్థితుల్లో వాహనం తీయాల్సి వస్తే మధ్య మధ్యన విరామం తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఇంజిన్ వేడి తగ్గుతుంది. రాత్రి సమయాల్లో ఒకసారి ట్యాంకు మూతతీసి తిరిగి పెడితే మంచిది. దీంతో గ్యాస్ బయటకు పోయి ఆయిల్ సులువుగా ఇంజిన్‌లోకి వెళ్తుంది. సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు బైక్‌పై ప్రయాణం చేయకపోవడమే ఉత్తమమని మేధావులు పేర్కొంటున్నారు.

నీడలో పార్కింగ్ చేయాలి



ఎండాకాలంలో బైక్‌పై దూరప్రయాణం తగ్గించుకోండి. ఎండ వేడికి టైర్లు మెత్తపడి గాలి దిగి బైక్ నిలిచిపోతుంది. ప్యాచీలు కరిగి బైక్ అదుపు తప్పే ప్రమాదం ఉంది. ఇంజిన్‌లో శబ్ధం వచ్చి మోరాయిస్తుంది. నీడలో పార్కింగ్ చేయాలి. మధ్యాహ్న సమయంలో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి. బైక్ తీసేటప్పుడు వేగంగా నడపవద్దు

– పొడుపుగంటి సోను, మెకానిక్, ఆసిఫాబాద్

శాంతియుతంగా జాతర నిర్వహించాలి


జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: మండలంలోని తాటిపల్లిలో మహాశివరాత్రి మహా జాతరను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై ఎస్.మధుకర్ సూచించారు. తాటిపల్లి సమీపంలోని వార్ధానది ఒడ్డున గల శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయంలో జాతర ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. జాతర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వాహనాలను ప్రత్యేక స్థలంలో పార్కింగ్ చేయాలన్నారు. ఆలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు, కమిటీ సభ్యులు ప్రవీణ్, మారుతి, సంతోష్, చంపత్, వాసుదేవ్, ధనరాజ్, తదితరులు ఉన్నారు.

ఘనంగా గాడ్గే బాబా జయంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహారలో సంత్ గాడ్గేబాబా మహారాజ్ 149వ జయంతి ని భారతీయ బౌద్ధ మహాసభ, అంబేడ్కర్ యువ జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ స్వచ్ఛత ప్రవక్తగా, అంటరానితనం నిర్మూలనకు, మూఢనమ్మకా లను పారద్రోలేందుకు ఆయన చేసిన కృషి గొప్పదని అన్నారు. బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, నాయకులు విజేయ్ ఉప్రే, సందీప్, ప్రతాప్, రోషన్, చింటు, రమేశ్, ప్రకాశ్, ఇంద్రజిత్, నాగ్‌సేన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా:
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899